కథా నిలయం
3879
శ్రీకాకుళం

# సుజాత

"డ్రైవిడ్! నాకోసం ఎవరైనా వచ్చారా?" తలంటు పోసుకున్న సుజాత కురులను టర్కీ టవలుతో తుడుచుకుంటూ మధ్య హాల్లోకొచ్చి అడిగింది.

"నో—మేడమ్" డేవిడ్ సమాధానం.

"ఎవరైనా వస్తే...ఇంటి దగ్గర కలుసుకునేందుకు వీల్లేదని చెప్పి పంపించేయి..." టవలు భుజాన వేసుకుని జుట్టు విదిలించుకుంటూ చెప్పింది.

"ఎస్, మేడమ్—"

తిరుగుతున్న సీలింగ్ ఫాను క్రిందగా నిల్చుని ఇంకా తడి ఆరని నల్లటి పొడవైన వెంట్రుకలను ఆర బెట్టుకుంటూంది సుజాత.

డేవిడ్‌ను చూస్తూంటే ...... సుజాతకి 'టినోపాల్' ఎడ్వార్డ్ బ్లైజమెంటే గుర్తుకు వస్తుంది.

"టీపాయ్ మీదున్న ఫైళ్ళు టపాల్ బాక్సులో సర్దుకో, డేవిడ్ ..."

"ఆల్ రైట్, మేడమ్.." అనేసి చెప్పిన పని చేసేటందుకు ఉపక్రమించాడు.

"నీ ఎస్, నో, ఆల్ రైట్స్‌తో చాలా ఇబ్బందిగా ఉంది! నీబట్లర్ ఇంగ్లీషు ఆపుజేసి తెలుగులో మాట్లాడు, డేవిడ్— నాకు అర్థమవుతుంది..."

సుజాత మాటకి అదోలా నవ్వేడు డేవిడ్. మళ్ళీ తన పని చేయటంలో లీనమైనాడు.

మనిషితీరు...పనిమీదశ్రద్ధ ... నిత్యమూ వ్యక్తపరిచే వినయ విధేయుతలు... వీటన్నిటినీ మించి డేవిడ్‌లో కన్పించే నమ్రత సుజాతకి చాలా లైకింగ్‌గా ఉంటుంది.

"మమ్మీ! కాఫీ పంపించు ..." ఇంట్లోకి, చూస్తూ కేకేసింది.

"మేడమ్! నన్ను తెమ్మంటారా...!" టక్కున తలెత్తి పని చేస్తున్నవాడల్లా అడిగేడు డేవిడ్.

"నో! సర్వెంట్ మెయిడ్ తెస్తుందిలే..."

డేవిడ్ మగాడు. అందునా కుర్రాడు... శాస్త్రోక్తంగా చదువుకున్న వాడిలా. సభ్యతా, సంస్కారం మనిషిలో ఉట్టిపడేలా ఉంటాడు. అందుకే ఆఫీసుపన్లుతప్ప ఇంటిపన్లు పురమాయించి చేయించుకునేందుకు సుజాత అభ్యంతరకరంగా ఫీలవుతుంది.

డేవిడ్ తన ఆఫీసు ప్యూనే అయినా...... కొన్ని పన్లు మాత్రమే అతని చేత చేయించేటందుకు ఇష్టపడుతుంది సుజాత!

పనిపిల్ల కాఫీ తెచ్చి సుజాతకి అందించి వెళ్ళిపోయింది.

కాఫీ తాగుతున్న మేడమ్ ఎదుటే నిల్చోవటం సభ్యత అన్పించుకోదని, మధ్యహాల్లోంచి వరండాలోకివచ్చి నిల్చున్నాడు డేవిడ్.

అతని చర్యని క్రీగంట కనిపెడుతూనే ఉంది సుజాత.

వాల్ క్లాక్ వరుసగా లయబద్ధంగా అయిదు గంటలు కొట్టింది.

కాఫీ కప్పు టీపాయ్ మీద ఉంచుతూ "డేవిడ్, నువ్వు జీపు తీసుకెళ్ళి డాక్టర్ రమాపతిగార్ని వెంటపెట్టుకురా..... మమ్మీకి ఇంజక్షన్ ఇవ్వాల్సిన వేళైంది..." అంది సుజాత.

పోర్టికోలో ఉన్న జీపు కదలి ముందుకు సాగిపోయింది.

*　　*　　*

ఆంధ్రప్రదేశ్ లో ప్రప్రథమంగా ఐ. ఎ. ఎస్. కి సెలక్టయిన తొలి మహిళ సుజాత!

"ఆడపిల్లకి ఐ. ఎ. ఎస్.లూ, ఐ. పి. ఎస్.లూ దేనికే? హాయిగా పెళ్ళిచేసుకుని మొగుడితో కాపురం చేసుకోక..." అన్నాడు రాఘవయ్య.

రాఘవయ్య స్వయాన సుజాతకు మేనమామ. మామయ్య మాటల్లో ఎగతాళి వ్యంగ్యం పసికట్టిన సుజాత, "ఆడదంటే.. కేవలం వంటింటి కుందేలు అనుకునే రోజులుకావు, మామయ్యా... ఇవి. స్త్రీ అన్ని రంగాల్లోనూ పురోగమిస్తూంది

ఇంకా నీవంటి ఛాందసులుండబట్టే పరిపూర్ణమైన పురోభివృద్ధిని సాధించలేకపోతున్నది స్త్రీ ...'' రాఘవయ్యని దెబ్బకొట్టింది.

"నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు! ఆడది ఆడదే!!! నువ్వెంత గొంతు చించుకున్నా.... మొగుడికి వండి పెట్టకా తప్పదు. పిల్లల్ని కనకామానదు. అయినా ఆడవాళ్ళు అన్ని ఉద్యోగాలకీ పనికిరారమ్మాయ్! అంతగా కావాలనుకుంటే... ఏడాక్టరో, నర్సో, టీచరో అదీకాకపోతే టెలిఫోన్ ఆపరేటర్ గానో ఉద్యోగంచేస్తే ముచ్చటగా ఉంటుంది. అంతేగాని.... తగుదునమ్మాని లాఠీ చేతబుచ్చుకుని పోలీసు ఉద్యోగాలు చేయటం...మగాడితో సమానంగా కలెక్టరు ఉద్యోగాలు దేనికి చెప్పు"? బల్లగుద్ది వాదించి మరీ చెప్పాడు రాఘవయ్య.

మామయ్యలాంటివాళ్ళు సంఘఅభివృద్ధి నిరోధక శక్తులై ఉంటారని అనుకుంది సుజాత.

అయినా మామయ్యలో పాతుకుపోయిన సనాతన అభిప్రాయాలను కూకటి వేళ్ళతోసహా పెకలించి వేయాలనే ప్రయత్నంలో "మామయ్యా, ఏ విషయంలోనూ స్త్రీ పురుషుడికి తీసికట్టు కాదనే నగ్న సత్యాన్ని నీలాంటి వాళ్ళు గ్రహిస్తే చాలు. పరోక్షంగా స్త్రీ పురోభివృద్ధికి దోహదం చేసినట్టే అవుతుంది. ఇప్పుడిప్పుడే కళ్ళు తెరిచి ... చీకటి సంప్రదాయాలను చీల్చుకుంటూ వెలుగులోకివచ్చి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పీల్చుకోవాలని ప్రయత్నిస్తూంది స్త్రీ జాతి. ఇంకా నీలాంటి వారుండబట్టే సంధియుగంలోంచి బైటపడలేకపోతూంది స్త్రీ. ఆడది...మగాడి చేతిలో కీలుబొమ్మ, తోలుబొమ్మ కాదని

నిరూపించేరోజు త్వరలోనే వస్తుంది..." మరో చురక అంటించింది సుజాత.

ఆ మాటకి కిమ్మన్లేక పోయాడు రాఘవయ్య.

చరచరా మేడమీదికెళ్ళిపోతున్న సుజాత కేసి నిశ్చలంగా చూస్తూ — "స్త్రీ ఎదిగిపోయిందమ్మా... ఇప్పటికే ఆకాశమంత ఎత్తుకి అనంతంగా ఎదిగిపోయింది..." అనేసి గొణుక్కున్నాడు.

తాను సెలక్టయినట్టు తెల్సిన రోజునే మామయ్యలాంటి మనిషితో వాదించాల్సివచ్చినందుకు విచారించింది సుజాత.

ఈరోజు నిజంగా సుజాత జీవితంలో మరువలేని, మరపురాని మధురమైన రోజు...

తాను ఆఫీసరు కావాలని తండ్రి ఎన్నో కలలు కన్నాడు. అన్నివిధాలా ప్రోత్సహించి చదివించాడు.

కానీ...తీరా తన సంతోషంలో పాలుపంచుకుని సంబరపడేందుకు తండ్రి ఇప్పుడు లేడు.

గోడకి వ్రేలాడుతున్న తండ్రి ఫోటోను సమీపించింది.

"డాడీ! నువ్వేగనుక బ్రతికిఉంటే ఈరోజు ఎంత ఆనందించేవాడివో? ... నీ ఆశయం ప్రకారం — ఆదేశానుసారం ... నీ పవిత్ర ఆశీస్సువల్ల ఐ. ఎ. ఎస్. కాగలిగేను..." తండ్రిఫోటోను ఆప్యాయంగా స్పృశిస్తూ కన్నీరు కార్చింది సుజాత.

"పిచ్చిసుజా! ఎందుకమ్మా ఆ కన్నీరు? నీ పట్టుదలా, తెలివితేటలూ మీనాన్న ఎరుగుదురు. ఎక్కడున్నా వారి ఆత్మ

తప్పక శాంతిస్తుందమ్మా..." అప్పుడే అక్కడికొచ్చిన తల్లి వోదార్చింది.

పసిదానిలా తల్లికౌగిలిలో ఇమిడిపోయింది సుజాత.

*　　　*　　　*

"సుజా, నువ్వటు కేంపు వెళ్ళగానే ఇటు మీ మామయ్య వచ్చి వెళ్ళాడు..." భోజనం చేస్తున్న సుజాతతో చెప్పింది తల్లి.

"ఏమిటెట విశేషం?" ప్రశ్నార్థకంగా తల్లి ముఖంలోకి చూస్తూ అడిగింది.

"నీ పెళ్ళి విషయం హెచ్చరించి వెళ్ళాడు..."

"నువ్వేమన్నావు?"

"నాదేముందమ్మా? అంతా నీయిష్టమేనని చెప్పాను"

"బావని చేసుకోవటం నాకిష్టంలేదమ్మా..." నిర్మొహమాటంగా చెప్పింది సుజాత.

"ఏం? ఎందుకనీ? వాడూ పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడు..."

"బావకూడా పూర్తిగా మామయ్య మన స్తత్వాన్నే పుణికి పుచ్చుకున్నాడనే నిజం మనకు తెల్సు. పెద్దచదువు చదివి, పెద్ద ఉద్యోగం చేసే ఆడదంటే బావకి చచ్చేటంత అసూయ చదువుకున్న అనాగరికుడు మనోహరం బావ! అలాంటి సంకుచిత భావాలున్న వ్యక్తిని నేను పెళ్ళి చేసుకోలేను..." చెయ్యి కడిగేసుకుని, టవల్ తో తుడుచుకుని డైనింగ్ టేబుల్ ముందు నుండి లేచినిల్చుంది సుజాత

"నేను నీకు చెప్పగలదాన్నా, సుజా... నీకు ఎట్లా బాగుంటుందనిపిస్తే అట్లా చేయి..." నిరుత్సాహంగా వెళ్ళిపోయింది తల్లి.

బెడ్ మీద వాలిపోయింది సుజాత.

బావ మనస్తత్వం తనకు సంపూర్ణంగా తెల్సు. వట్టి జెలసి మనిషి బావ. బావ దృష్టిలో ఆడది ఒక బానిస. స్త్రీని గౌరవించటం చేతగాని చదువుకున్న మూర్ఖుడు!!

అలాంటి సంకుచిత భావాలున్న బావలాంటి వ్యక్తిని తాను పెండ్లాడటమా? నో!. ఎన్నోరకాలుగా ఆలోచిస్తున్న సుజాత ఒక నిర్ణయానికొచ్చినట్టు తల అడ్డంగా ఆడించింది.

*   *   *   *

ప్రతిరోజూ అరగంట ముందుగానే డేవిడ్ ఆఫీసుకొస్తాడు.

సుజాత ఆఫీసు రూమ్ శుభ్రంగా తుడిపించి, కూజాలో మంచినీళ్ళు పెట్టించి ఉంచుతాడు.

ఆఫీసుకు ఇంకా సుజాత అప్పటికి రాలేదు.

సుజాత ఆఫీసు ఛేంబర్ డోర్ పక్కనే ఉన్న స్టూలు మీద కూర్చున్నాడు డేవిడ్.

సుజాత కోసమే టైము అవుతున్నా ఇంకా 'ఆఫీసుకి రాలేదేమా'నే ఆలోచిస్తున్నాడు.

ఇంతలో టెలిఫోన్ మ్రోగింది.

తలుపు తోసుకొని ఛేంబర్లోకి అడుగు పెట్టాడు. డేవిడ్.

రిసీవర్ చేతిలోకి తీసుకొన్నాడు.

"ఎస్, అవును! డేవిడ్ స్పీకింగ్... వాట్?! వో.. ప్రభాకర్! నువ్వా... హౌ ఆర్యూ? ఎస్, ఆప్టర్ ఎ లాంగ్ టైమ్... అవును, ఫ్రమ్ వేర్ యువార్ స్పీకింగ్ నౌ? ... హోటల్ మనోరమా... ఐ. సీ. ఆఫ్‌కోర్స్. ఐయామ్ ఆల్ రైట్, హౌ ఎబౌట్ యూ? ఐ కుడ్ నాట్ ఎటెండ్ యువర్ మేరేజ్... సారీ...రూమ్ నెంబర్ త్రీనాట్ ఫోర్,..ష్యూర్.. ఈవినింగ్ తప్పక కలుస్తాను. డెఫనెట్లీ ఐ విల్ స్పెండ్ సమ్ టైమ్ విత్ యూ... థాంక్యూ..." హుక్ మీద రిసీవర్ పెట్టిన డేవిడ్ ముఖంలో ఆనందం చోటు చేసుకుంది.

తనకున్న ఆప్తమిత్రుడల్లా ఒక్క ప్రభాకరే!

గిర్రున తిరిగి బైటికి వెళ్ళబోయాడు డేవిడ్. డోర్ దగ్గర సుజాతని చూచి నిరుత్తరుడయ్యాడు.

డేవిడ్‌ని నఖశిఖ పర్యంతం ఒకసారి నిశితంగా చూచింది సుజాత.

సుజాత చూపులో భావం బోధపడ్లేదు డేవిడ్‌కి. వచ్చి చైర్లో కూర్చుంది.

డేవిడ్ బైటికి వెళ్ళ బోయాడు.

"మిస్టర్ డేవిడ్! కమ్ హియర్..." అధికార పూర్వకమైన స్వరంతో అంది సుజాత.

సుజాతలో తొలిసారిగా కోపాన్ని చూడగల్గుతున్నాడు డేవిడ్.

గట్టిగా ఊపిరి పీల్చి వదలి, "నువ్వేం చదువుకున్నావ్?" అని సూటిగా అడిగింది.

"......"

"మాట్లాడవేం?—" గద్దించింది.

"ఎస్. ఎస్. ఎల్. సి. ..." ఎటో చూస్తూ చెప్పాడు.

"నో! — ఐ కాంట్ బిలీవ్ — మోరోవర్ యువార్ బ్లఫింగ్!..."

ఒకసారి సుజాత కేసి చూశాడు. డేవిడ్.

"యువార్ నాట్ టెలింగ్ మిది ట్రూత్! క్రితం వారం నాతోపాటు నువ్వు కేంపు కొచ్చినప్పుడు... వరండాలో ఇంగ్లీషు నవల చదువుతూ ఉండటం నా కళ్ళారా చూశాను.. ఈరోజు నువ్వు అనర్గళంగా ఇంగ్లీషులో ఫోన్లో ఎవరితోనో మాట్లాడటం నా చెవులారా విన్నాను- డోన్ట్ డిసీవ్ మి... కమాన్.. ఐ వాంట్ ఫేక్ట్స్..."

డేవిడ్‌లో ఏ విధమైన చలనమూ చోటు చేసుకోలేదు.

బరువుగా గాలి పీల్చి వదిలేడు.

ఏదో చెప్పబోయి ఆగేడు.

సుజాత చూపుల్లో చురుకుదనాన్ని చూచి తట్టుకోలేక పోతున్నాడు.

డేవిడ్ మౌనాన్ని సహించలేక పోతూంది సుజాత.

"సో, యు డోన్ట్ వాంట్ టు రిప్లై మి.." అసహనంగా అడిగింది.

డేవిడ్ ముఖంలో రంగులు మారుతున్నాయి.

సుజాత తీక్ష్ణంగా అతని కేసే చూస్తూంది,

"సారీ, మేడమ్. ఇక నిజాన్ని దాచలేను. నేను ఎమ్. ఎ. పాసయ్యాను. అయితే నన్నూ. నా డిగ్రీని చూచి నా కెవ్వరూ ఉద్యోగం ఇవ్వలేదు. పోస్ట్-గ్రాడ్యుయేట్ని అయి ఉండీ రెండేళ్ళు ఉద్యోగం దొరకక బాధపడ్డాను. మా కుటుంబం చాలా పెద్దది!. మా ఫాదర్ రైల్వేలో గేంగు మేస్త్రీ చేస్తూ అకస్మాత్తుగా కన్నుమూశాడు. నా తర్వాత చెల్లెళ్ళు, తమ్ముళ్ళు ఉన్నారు. సంసార బాధ్యత నామీద విరుచుకు పడ్డది. నన్ను ఎన్నో సమస్యలు వెంటాడాయి.; ఇబ్బందులు పీక్కు తిన్నాయి. చివరికి నిజాన్ని దాచి పెట్టి నా క్వాలిఫికేషన్ ఎస్. ఎస్. ఎల్. సి. అని చెప్పి ఋజువు చూపించి చివరికీ ఉద్యోగంలో చేరాను. మేమంతా కనీసం ఒక్క పూటయినా తిండి తినగల్గుతున్నాము, ఇలాంటి చిన్న జాబే చేయాల్సి వచ్చినందుకు బాధ పడ్లేదు. డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటే నాకెంతో ఇష్టం! చేస్తున్నది ఎలాంటి ఉద్యోగమైనా మనఃస్ఫూర్తిగా చేయాలన్నదే నా ధ్యేయం. నా ఫ్రండ్సు చాలా మంది హై పొజిషన్సులో ఉన్నారు. ఎవరి లక్ వాళ్ళది! అయితే నేను ఎల్ల కాలం ఇదే ఉద్యోగం చేస్తాననుకోవటం లేదు. ఏదో రోజు

అదృష్టం నన్ను వరించవచ్చు. ఆరోజు... జీవితంలో మరో మలుపు,..!ఆశతో బ్రతుకుతున్న మనిషిన్నేను...! క్రైన్ డ్లీసే..' యామ్ ఐ ఎట్ ఫాల్ట్..." ఆవేశంగా మాట్లాడాడు డేవిడ్.

అతని ప్రశ్నలకు ఏమని సమాధానం ఇవ్వాలో తోచ లేదు సుజాతకి.

"ఆల్ రైట్...యుకెన్ గో..." అనేసి రెండు చేతులతో తలపట్టుకు కూర్చుండి పోయింది.

ఆరోజు మీటింగ్ కార్యక్రమం పూర్తి చేసుకుని ఇల్లు చేరుకునే సరికి పొద్దుపోయింది.

మనిషి బాగా అలసిపోయివున్నట్లు కనిపిస్తూంది సుజాత.

రాగానే వేడినీళ్ళు స్నానంచేసి బెడ్ మీద వాలిపోయింది.

''సుజా!—నీకు ఉత్తరాలు వచ్చాయమ్మా..." అనేసి రెండు కవర్లు అందించి వెళ్ళింది తల్లి.

ఒక కవరు చించింది.

అది మామయ్య వ్రాశాడు. అందులో తన పెళ్ళి గురించే ప్రస్తావించాడు. నిర్ణయాన్ని తెల్పమంటూ వ్రాశాడు.

రెండో కవరు వోపన్ చేసింది.

అందులో ఇలా ఉంది...

''సుజాత, ఐ. ఎ. ఎస్. గారికి,

నమస్సులు!

మీకు పర్సనల్ లెటర్ వ్రాస్తున్నందుకు మన్నించగలరు.

స్టేట్ బ్యాంక్ లో ప్రొబేషన్ ఆఫీసరుగా సెలక్షన్ వచ్చింది.

ప్రస్తుతం ట్రైనింగ్‌లో ఉన్నాను.

మీవద్ద ప్యూనుగా పనిచేసినంత కాలం మీరు నా ఎడల చూపిన ఆదరాభిమానాలకు నా ధన్యవాదాలు!!

మీకు గుర్తుందా...నాకు భవిష్యత్తు మీద ఆశఉందని ఆరోజు...నిజాన్ని నిగ్గదీసి నన్ను అడిగినప్పుడు చెప్పాను.

నో ఐయామ్ ఆల్ రైట్—

ముందుగా మీచేత సెలవు గ్రాంటుచేయించుకుని వెళ్ళే అవకాశం లేకపోయింది.—మీకు ఇబ్బంది కలిగించాను.

ఈ ఉత్తరంతోపాటు నా ప్యూను పోస్ట్‌కి రిసిగ్నేషన్ లెటర్ జతపరుస్తున్నాను – అంగీకరించగలరు.

దేవుడు నన్ను కరుణించాడు! — ఇంతకంటే జీవితంలో నేను మరే అదృష్టాన్నీ కోరుకోవడం లేదు.

సెలవు...

—డేవిడ్.'

"యు ఆర్ రియల్లీ లక్కీ, డేవిడ్ ..." అని గొణుక్కుంటూ చదివిన ఉత్తరాన్ని కవర్లో ఉంచింది సుజాత.

* * *

పంచలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు రాఘవయ్య.

ఇంతలో పోస్ట్‌మన్ వచ్చి లెటర్ అందించి వెళ్ళాడు.

"ఇదేదో శుభలేఖలా ఉందే..." అనుకుంటూ కవరు విప్పాడు రాఘవయ్య.

సుజాత, ఐ. ఎ. ఎస్. కి డేవిడ్, ఎమ్. ఎ. తో వివాహం..

శుభ లేఖలో వధూవరుల పేర్లు చూడగానే మండిపడ్డాడు రాఘవయ్య

శుభ లేఖ ఉన్న కవర్లో ఉత్తరం కూడా కనిపించింది.

"మామయ్యా!

నాకు తెలుసు... బావని పెండ్లి చేసుకోనందుకు నువ్వు నా పెళ్ళికి రావని!

మనుష్యుల్లో వస్తున్న మార్పును నువ్వు హర్షించాలి!— తప్పదు!!!

మనిషికి మంచిమనసు ప్రధానం! అదికొరవడిన కారణం గానే నేను బావని పెళ్ళిచేసుకోలేక పోతున్నాను.

నా సాహసానికీ — నిర్ణయానికీ మన్నించు. మంచి మనసుతో దీవించు!! — అదిచాలు!!! —అదే నీనుండి నేను కోరుకునేది.

ఇట్లు,

— సుజాత"

శుభ లేఖను ..... ఉత్తరాన్ని నలిపివేశాడు కసినిండిన రాఘవయ్య. అదిచాలదన్నట్లు చించి ముక్కలు చేశాడు.

చినిగిపోయిన ప్రతి కాగితం ముక్కలోనూ సుజాత రూపమే ప్రతిఫలిస్తున్నట్లూ... తనను వెక్కిరిస్తున్నట్లూ... అనిపించింది రాఘవయ్యకి

(17-1-79 ఆంధ్రప్రభ వీక్లీలో ప్రచురితము)

With the best Compliments
from

*Phones:* { *Offi. 2160 : 2375*
*Resi. 2436.*

**Grams : *"MITSON"***

# MITSON

## WINE DISTRIBUTORS

## TIRUPATI - 517501

*BRANCHES :*

**Anantapur, Chittoor, Guntur, Nellore,**

**Kurnool.**